క్లుప్తంగా

చేనేత వస్త్రధారణతో హుందాతనం

వైవీయూ: చేనేత వస్త్రాలను ధరించడం ద్వారా హుందాతనం వస్తుందని వైవీయూ లలితకళల విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు పేర్కొన్నారు. బుధవారం చేనేత దినోత్సవం సందర్భంగా ఫైన్‌ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో 'విజయనగర కాలంలో ఫ్యాషన్ – చేనేత' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చేనేత వస్త్రాలను వారంలో ఒక్కసారైనా ధరించాలని, తద్వారా దేశ సంస్కృతి, సంప్రదాయాలను, ప్రతిష్టను ఇనుమడింపచేయవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలు ప్రమాదకరం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలు కార్మిక వర్గానికి, సామాన్య ప్రజలకు నష్టం కలిగించే విధంగా ఉన్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. బుధవారం నగరంలోని హొచిమిన్ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర సంస్థలలో 23 లక్షల పోస్టులు ఖాళీగా ఉండికూడా దేశంలో యువత ఉద్యోగాలులేక నిరుద్యోగులుగా మిగిలిపోయారన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ.బాదుల్లా, జిల్లా ఉపాధ్యక్షురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడిని ఖండించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండించాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాష పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఆవాజ్ జిల్లా కార్యాలయంలో పాలస్తీనా సంఘీభావ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న కడప నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సును అన్ని వర్గాల వారు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. అన్వర్ బాష, ఎస్ బాష పాల్గొన్నారు.

పెండింగ్ అలవెన్స్ చెల్లించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు ఇవ్వాల్సిన పెండింగ్‌లో ఉన్న అలవెన్స్ మొత్తాలను చెల్లించాలని ఏపీ ఆశా వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు యు. మరి యమ్మ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి. శాంతమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అలవెన్స్ చెల్లించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ జిల్లా కోశాధికారి అమ్ములు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డ్ చట్ట సవరణ అనవసరం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: వక్ఫ్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం పలు సవరణలు చేస్తోందని గత కొన్ని రోజులుగా సామాజిక మధ్యమాలలో వార్తలు వస్తున్నాయని, అయితే వక్ఫ్ చట్టంలో సవరణలు చేయాల్సిన అవసరం లేదని ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ బాష పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పూర్వీకులు చాలా పెద్ద ఎత్తున ఖరీదైన భూములను దానం చేశారని ఆ రోజుల్లోనే ఇస్లామిక్ చట్టం ప్రకారం వక్ఫ్ అయిందని ఇందులో కేంద్రం జోక్యం అవసరం లేదని అన్నారు. వక్ఫ్ బోర్డ్ చట్ట సవరణ బిల్లును ఇండియా కూటమి మిత్రపక్ష పార్టీలన్నీ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆప్ కి ఆవాజ్ నగర అధ్యక్షులు ఆబిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

మార్గదర్శనం అవసరం

కడప స్పోర్ట్స్: యువత సరైన లక్ష్యాలను నిర్దేశించుకునేందుకు, వాటిని సాకారం చేసుకునేందుకు సరైన మార్గదర్శనం అవసరమని స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని వివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో 'కెరీర్ కౌన్సిలింగ్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ డి. మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ కెరీర్ కౌన్సిలింగ్ అన్నది సరైన మార్గాన్ని గుర్తించడంలో సహాయపడుతుందన్నారు. కెరీర్ కౌన్సిలర్ భాస్కర్ వర్మ , కళాశాల ప్రిన్సిపాల్ నాగమణి, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి కోసం వేధిస్తున్నారు

కడప రూరల్: మూడేళ్ల క్రితం తనను వద్దనుకొని వదిలేసి వెళ్లిన తన భార్య, రెండవ కుమారుడు ఆస్తి కోసం వేధిస్తున్నారని కడప నగరం కాసంశెట్టి నరసయ్యవీధికి చెందిన చెన్న మల్లికార్జునరావు ఆరోపించారు. బుధవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడేళ్ల క్రితం తనతో పాటు తన పెద్ద కుమారుడిని తన భార్య, రెండవ కుమారుడు వదిలేసి వెళ్లారని అన్నారు. వారు బెంగుళూరులో స్థిరపడ్డారని తెలిపారు. కాగా తన జీవనాధారం కోసం ఒక ఇంటిని బాడుగకు ఇచ్చామన్నారు. ఇప్పుడు బెంగుళూరు నుంచి తన భార్య, రెండవ కుమారుడు వచ్చి బాడుగ ఇంట్లో ఉన్నవారిపై ఖాళీ చేయాలని బెదిరించి కేసులు బనాయించారని ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

ఇంటి వద్దకే రేషన్ అందించాలి

రేషన్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసి పేదలకు ఇంటి వద్దకే నిత్యావసరాలు అందించాలని అప్పట్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. ఇంటింటికీ రేషన్ అందించడం కోసం ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేశారు. అలాగే నిరుద్యోగులైన వారికి ఈ వాహనాల ద్వారా ఉపాధి కల్పించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈవిధానాన్ని ఎత్తివేసి మళ్లీ పాత విధానంలో రేషన్ దుకాణాల ద్వారా అందించే ఆలోచన చేసింది. ఇటీవల సీఎం చంద్రబాబు నాయుడు ఎండీయూ వాహనాలను తొలగిస్తామని చెప్పడంతో రేషన్ లబ్ధిదారులతో పాటు వాహన డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. – కడప కోటిరెడ్డిసర్కిల్

జనవాక్కు

ఇంటింటికి రేషన్ కొనసాగించాలి



ఇంటింటికి రేషన్ పథకాన్ని కూటమి ప్రభుత్వం కచ్చితంగా కొనసాగించాలి. గతంలో రేషన్ కోసం రేషన్ షాపుల వద్దకు వెళ్లి గంటల తరబడి క్యూ లైన్లలో నిలిచే వాళ్లం. వృద్ధులు, వికలాంగులు పడే బాధలు, కష్టాలు చూసిన జగనన్న అధికారంలోకి వచ్చాక ఇంటికే రేషన్ పంపించారు. కాలు కదపకుండా ఈ ఐదేళ్ళు బియ్యం తీసుకున్నాం. ఇప్పుడు బియ్యం బండి రాకుంటే మా పరిస్థితి ఏమిటి?. బియ్యం బండ్లు యథావిధిగా నడపాలి.
– డి. సుబ్బమ్మ, లోహియానగర్, కడప

కూటమి ప్రభుత్వం నిర్ణయం మార్చుకోవాలి



జగన్ ప్రభుత్వం మినీ ట్రక్కులను నిరుద్యోగులకు ఇవ్వడం వల్ల ఉపాధి లభించేది. రేషన్ కార్డుదారులకు ప్రతి నెలా ఇంటి వద్దకే వచ్చి నిత్యావసర సరుకులు పంపిణీ చేసేవారు. రేషన్ షాపుల వద్దకు వెళ్లి గంటల తరబడి వేచి చూడాల్సిన పని లేకుండా జగన్ హయాంలో సరుకులు తీసుకున్నాం. కూటమి ప్రభుత్వం కూడా పాత పద్ధతిలోనే ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులు ఇవ్వాలి.
–ఇమ్మానుయేల్, రెడ్డి కాలనీ, కడప నగరం

దూరం..భారం ఉండేది కాదు



గతంలో రేషన్‌షాపు వద్దకు వెళ్లి కార్డుదారులు పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఒక రోజంతా కూలి పనులు, పనిపాటలు ఆపాల్సి వచ్చేది. జగన్ ప్రభుత్వ హయాంలో మినీ ట్రక్కుల ద్వారా నేరుగా ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులు ఇచ్చేవారు. దూరం వెళ్లాల్సిన పని తప్పింది. వ్యయప్రయాసలు ఉండేవి కావు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగించాలి. – సునీత, రెడ్డి కాలనీ, కడప నగరం

గత ప్రభుత్వం విధానాన్ని కొనసాగించాలి



వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో బియ్యం బండి నేరుగా ఇంటి వద్దకే వచ్చేది. ఏ కష్టం లేకుండా సంతోషంగా సరుకులు తీసుకునే వాళ్ళం. సమయం వృధా అయ్యేది కాదు. ఇప్పుడు మళ్లీ స్టోర్‌లకు పోవాలంటే పనులన్నీ వదులుకుని వెళ్లాలి. అక్కడ గంటల తరబడి వేచి చూడాలి. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం విధానాన్ని కొనసాగించాలి.
– ఉమాపతి, మృత్యుంజయకుంట, కడప నగరం

కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో రోడ్డుపై వాన నీరు



నగరంలో వానొస్తే ఇంతే..!



కడప ఆర్టీసీ బస్టాండుతోపాటు పరిసరాలు మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జలమయం అయ్యాయి. వర్షం కురిసినపుడల్లా బస్టాండు ఆవరణం జలమయం అవుతూ వస్తోంది. తాజాగా కురిసిన వర్షంతో బస్టాండు అవుట్‌గేట్ వద్ద వర్షపునీరు అలలతో ముందుకు సాగుతూ ప్లాట్‌ఫామ్‌ను తాకింది. వర్షం నిలిచి గంటలు గడిచినా ఆ నీరు అలాగే నిలబడి ఉంది.
– కడప కోటిరెడ్డిసర్కిల్



కడప ఆర్టీసీ బస్టాండు జలమయం అయిన దృశ్యం

ఆర్ట్స్ కళాశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి
- ప్లాటినం జూబ్లీ వేడుకలకు సహకారం : ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల) అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని ఓ ప్రైవేట్ సమావేశ మందిరంలో ఆర్ట్స్ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకల సన్నాహక, పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులందరూ ఏకమై ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించేందుకు పూనుకోవడం అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ చరిత్ర కలిగిన గొప్ప కళాశాలలో చదవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ సెప్టెంబర్ 13, 14 తేదీల్లో ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థి అమెరికాకు చెందిన గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా. సంజీవరెడ్డి మాట్లాడుతూ తాము ఈ స్థాయిలో ఉన్నామంటే ఆర్ట్స్ కళాశాలలో చదవడం వల్లేనన్నారు. కళాశాల అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. ప్లాటినం జూబ్లీ సెలబ్రేషన్స్ కన్వీనర్ ఎస్.వి. రామ్మూర్తి, కార్యదర్శి లయన్ కె. చిన్నపరెడ్డి, ఆచార్య రాజశేఖరరెడ్డి, డా. ఎం.సి. వెంకటసుబ్బయ్య, నారాయణరెడ్డి, బాలసుబ్రమణ్యం, మేడా జనార్ధన్, ప్రకాష్ రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి

మెకానిక్‌ను ఆదుకోవాలి

కడప రూరల్: చెట్టు కూలి మెకానిక్ షాప్ పూర్తిగా ధ్వంసమైంది. ఈ సంఘటనకు సంబంధించిన టూ వీలర్ మెకానిక్ బండి బాబును ఆదుకోవాలని టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోషియేషన్ కడప నగర ఉపాధ్యక్షులు పీ ఖాదర్‌బాష తెలిపారు. బుధవారం ఆయన ధ్వంసమైన బంకును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పాత మహిళా పోలీస్ స్టేషన్ సమీపంలో టూ వీలర్ మెకానిక్ బండి బాబు ఒక బంకును ఏర్పాటు చేసుకొని మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నారని అన్నారు. రాత్రి కురిసిన వర్షానికి చెట్టు కూలడంతో ప్రహరీ పడిపోయిందన్నారు.

అర్హులకు పంపిణీ చేయాలి



వాహనాలను పరిశీలిస్తున్న పీఆర్‌ఎస్ వైఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన ఆటోలు, ట్రాక్టర్లను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చెయ్యకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పీఆర్‌ఎస్ వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన వీటన్నింటిని కడప నగర శివార్లలోని హోమియోపతి కళాశాల వెనుక భాగాన ఉన్న మహిళా శక్తి ప్రాంగణంలో ఉంచారన్నారు. వీటిని బుధవారం పీఆర్‌ఎస్ వైఎఫ్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ 28 ట్రాక్టర్లను, 75 ఆటోలను మహిళా శక్తి ప్రాంగణంలో నిరుపయోగంగా వదిలేశారన్నారు. అధికారులు స్పందించి అర్హులకు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఎస్ వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు, జిల్లా నాయకులు వెంకటేష్, శ్రీనాథ్, తరుణ్ పాల్గొన్నారు.

అలరించిన భక్తి గీతాలాపన



భక్తి గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం కళావేదికపై బుధవారం కడపకు చెందిన జ్ఞానద కల్చరల్ ట్రస్ట్‌కు చెందిన పలువురు కళాకారులు ఆలపించిన భక్తి గీతాలాపన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బుధవారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై పి.హిమబిందు పలు కీర్తనలను ఆలపించగా, జగన్మోహిని మృదంగంపై, అభిరామ్ వయొలిన్‌పై భావజ్ఞ వాద్య సహకారం అందించారు. అమ్మవారి దర్శనానంతరం రాజగోపురం వద్దకు చేరుకున్న భక్తులు భక్తి గీతాలను ఆలకించి మంత్ర ముగ్ధులయ్యారు.

వర్షపునీటిని వెంటనే తొలగించాలి

కడప కార్పొరేషన్: మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి నగరంలో చాలా ప్రాంతాల్లో రహదారులపై నీరు నిలిచాయని, వాటిని వెంటనే మిషన్ ద్వారా తొలగించాలని నగరపాలక అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రన్ ఆదేశించారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన రామరాజుపల్లి, వినాయక నగర్ సర్కిల్, అలంఖాన్‌పల్లి, జిల్లా కోర్టు ప్రాంతాలను పరిశీలించారు. అలంఖాన్‌పల్లెలో చెత్త పాయింట్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 100 శాతం ఇంటింటి చెత్త స్వీకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెయిన్ రోడ్స్‌లో ఉన్న చెత్త పాయింట్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోటిరెడ్డి సర్కిల్, ఆర్టీసీ బస్టాండు వద్ద నీరు నిల్వ ఉండటం గమనించి జేసీబీ ద్వారా నీరు వెళ్లుటకు మార్గం సుగమం చేశారు.



ఆర్టీసీ బస్టాండు వద్ద జేసీబీతో కాలువ తీయిస్తున్న అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రన్

ఆర్టీసీ బస్టాండు మార్గంలో వచ్చే వర్షపునీరు సజావుగా వెళ్లేందుకు కాలువల్లో పూడిక తీయాలన్నారు. అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో మ్యాక్స్ షోరూం వద్ద పూడిక తీత పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీఈ వేణుగోపాల్ గారు, ఏఈ భవన్ కుమార్, ఎంహెచ్ఓ డా. చంద్రశేఖర్, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రయాణం చేయండి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని దాల్మియా సిమెంట్స్ కడప యూనిట్ హెడ్ ముకేష్‌కుమార్ సిన్హా పిలుపునిచ్చారు. దాల్మియా భారత్ లిమిటెడ్‌కు చెందిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా బుధవారం నిర్వహించిన ర్యాలీ కలెక్టరేట్ నుంచి కోటిరెడ్డి సర్కిల్ వరకు కొనసాగింది. ర్యాలీలో ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ముఖేష్‌కుమార్ సిన్హా మాట్లాడుతూ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించమే కాకుండా ప్రమాదంలో రక్షణనిచ్చే 200 క్రాష్ హెల్మెట్‌లను స్థానికంగా డ్రైవింగ్ లైసెన్సులు కలిగిన వ్యక్తులకు పంపిణీ చేస్తున్నామన్నారు. కడప ప్లాంట్‌లోని సీఎస్ఆర్ బృందం 100 హెల్మెట్‌లను కడప జిల్లా కలెక్టర్‌కు అందించగా, మిగిలిన హెల్మెట్‌లను పొరుగు గ్రామాలలోని అర్హులైన వారికి పంపిణీ చేశామన్నారు. అలాగే భద్రతకు సంబంధించిన పలు అంశాలపైన అవగాహన కల్పిస్తూ సంబంధిత సమాచారంతో కూడిన కరపత్రాలు, మెటీరియల్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, సంస్థ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



హెల్మెట్లను అందజేస్తున్న దాల్మియా సిమెంట్స్ ప్రతినిధులు

విలువలతో కూడిన విద్యనందించాలి

వైవీయూ: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా ఉత్తమ పౌరులను సమాజానికి అందించవచ్చని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేమల సలీంబాషా పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నోడల్ రీసోర్స్ సెంటర్‌లో యునెస్కో, ఎంజీఐఈపీ, కళాశాల విద్య సంయుక్త ఆధ్వర్యంలో జోన్–4 పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన 42 మంది అధ్యాపకులకు ఎస్ఈఎల్ (సోషల్ అండ్ ఎమోషనల్ లెర్నింగ్) అండ్ ఎస్ఈఈకే (సెల్ఫ్ డైరెక్టెడ్ ఎమోషనల్ లెర్నింగ్ ఫార్ ఎంఫథీ అండ్ కైండ్‌నెస్) అన్న అంశంపై 5 రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదువుతో పాటు నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భావోద్వేగాలను నియంత్రించుకోవడం, భావోద్వేగాన్ని ప్రభావితం చేసే కారకాల గురించి వివరించారు. అనంతరం 9 మంది రీసోర్స్ పర్సన్‌లు శిక్షణకు సంబంధించిన అంశాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నోడల్ రీసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ డా. ఎం.వి. రమణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా

కింగ్ సౌద్ విశ్వవిద్యాలయంతో వైవీయూ ఎంఓయూ

వైవీయూ: సౌదీ అరేబియాకు చెందిన ప్రసిద్ధ కింగ్ సౌద్ విశ్వవిద్యాలయంతో వైవీయూ ఎంఓయూ కుదుర్చుకుంది. కింగ్ సౌద్ విశ్వవిద్యాలయంకు చెందిన పునరుత్పాదక, పర్యావరణ పరిశోధక సంస్థ ఆచార్యులు డా. ఫతేవుల్లా, వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డిలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. వెంకట్రామ్, ఐక్యూఏసీ సంచాలకులు ఎల్. సుబ్రమణ్యంశర్మ పాల్గొన్నారు.

నానోసైన్స్ పాత్ర కీలకం..

పునరుత్పాదకశక్తి, పర్యావరణానికి సంబంధించిన సాంకేతికతలో నానో సైన్స్ పాత్ర ఎంతో కీలకమని కింగ్ సౌద్ విశ్వవిద్యాలయంకు చెందిన ఆచార్యులు డా. ఫతేవుల్లా పేర్కొన్నారు. బుధవారం వైవీయూలో భౌతికశాస్త్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో డా. ఫతేవుల్లా కీలక ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో ఫిజిక్స్ ప్రొఫెసర్ డా. వై.పి. వెంకటసుబ్బయ్య, డా. వెంకట్రామ్, ఆచార్య ఏజీ దాము, డా. సుబ్రమణ్యంశర్మ తదితరులు పాల్గొన్నారు.

దళారులను సంప్రదించవద్దు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రవాణాశాఖకు డ్రైవింగ్ లర్నింగ్ లైసెన్స్ టెస్ట్, డ్రైవింగ్ టెస్ట్‌లకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు దరఖాస్తు చేసుకుని స్లాట్ తేదీలు, సమయాలలో నేరుగా రవాణా శాఖ కార్యాలయంలోనే సంప్రదించాలనీ కడప ఎంవీఐ శ్వేత బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎలాంటి మధ్యవర్తులను గానీ, దళారులనుగానీ ఆశ్రయించవద్దని పేర్కొన్నారు. కొందరు తప్పుడు ప్రచారాలను, రవాణా శాఖ అధికారులపై ఆరోపణలను చేస్తూ సోషల్ మీడియాలో పెట్టి ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. అలాంటి తప్పుడు ప్రచారాలను చేసేవారిపైన చట్టపరంగా చర్యలను తీసుకునేందుకు వెనుకాడమన్నారు.

ఆరోపణలు ఉన్న వ్యక్తిని వీసీగా నియమించడం తగదు



నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

వైవీయూ: లైంగిక ఆరోపణలు ఉన్న వ్యక్తిని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా నియమించడం తగదని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివశంకర్, వలరాజు పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వీసీ నియామకాన్ని వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకడమిక్‌గా, పరిశోధనల పరంగా ప్రగతి పథంలో ఉన్న వైవీయూకు ఆరోపణలు ఉన్న ఆచార్యులు కృష్ణారెడ్డిని ఇన్‌చార్జి వీసీగా నియమించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వీసీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలు

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 8వ తేదీ శుక్రవారం లలిత జువెలర్స్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన పురుషులు, మహిళలు ఈ ఎంపికల్లో పాల్గొనవచ్చన్నారు.

కడప రిమ్స్ సీఐగా సీతారామిరెడ్డి



కడప అర్బన్ : కడప రిమ్స్ పీఎస్ సీఐగా వి. సీతారామిరెడ్డి బుధవారం సాయంత్రం బాధ్యతలను చేపట్టారు. 2007 బ్యాచ్‌కు చెందిన ఈయన ఎస్ఐగా విధులను నిర్వహించారు. అనంతరం సీఐగా గత రెండున్నర సంవత్సరాలుగా కడప ట్రాఫిక్‌లో పనిచేశారు. ఇటీవల బదిలీలలో రిమ్స్ పీఎస్ సీఐగా నియమితులయ్యా రు. ఈ సందర్భంగా సీఐ సీతారామిరెడ్డి మాట్లాడుతూ తమ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తామని తెలియజేశారు.

జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన పెరగాలి

కడప ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ పై అవగాహన పెరగాలని కడప మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి సూచించారు. బుధవారం నగరంలోని సీఎస్ ఐ స్కూల్‌లో ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని మండల స్థాయిలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలలో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు మండల స్థాయి పోటీలు నిర్వహించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

వైవీయూ: భారతదేశ చేనేత కళాకారుల నైపుణ్యానికి నిదర్శనం చేనేత వస్త్రాలు అని కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కడప ఆప్కో చేనేత వస్త్రాలయం అధికారి రామకృష్ణ చేనేత వస్త్రాల ప్రాధాన్యత తెలియజేసే పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు వితరణ



క్రీడా దుస్తులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: నగర శివార్లలోని అంగడివీధిలో పదవీ విరమణ పొందిన హెచ్ఎం ఉప్పలూరు సుజాత విద్యార్థులకు క్రీడా దుస్తులను విరతణగా ఇచ్చారని హెచ్ఎం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వితరణగా ఇచ్చిన క్రీడా దుస్తులతో వారిలో నూతన ఉత్సాహం కలుగుతుందన్నారు. క్రీడా దుస్తులను వితరణగా ఇవ్వడంపై పాఠశాల క్రీడా ఉపాధ్యాయులు ఆగ్గిరప్ప కృతజ్ఞతలు తెలిపారు.

ఠాగూర్‌కు ఘన నివాళి

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని మట్టి పెద్దపులి వద్ద జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో బుధవారం ఆర్కే సేవా సమితి ఆధ్వర్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్‌బాషా , ఆర్కే షేక్ రాయల్ కరీముల్లా, వహీద్ , అల్లా బకాష్, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

యురేనియం ప్రాజెక్టు సందర్శన

వేముల: మండలంలోని తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టును యోగివేమన విశ్వవిద్యాలయంలోని జియాలజీ భాగానికి చెందిన విద్యార్థులు బుధవారం సందర్శించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటానమిక్ ఎనర్జీ 70సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా యూసీఐఎల్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ షిప్ కింద ఈవెంట్లు నిర్వహిస్తున్నారు. దీంతో వైవీయూ జియాలజీ విభాగానికి చెందిన విద్యార్థులు, అధ్యాపకులు తుమ్మలపల్లె యురేనియం మైనింగ్, మిల్లును సందర్శించారు.